క్లుప్తంగా

అన్నపూర్ణమ్మ సేవలు ఎనలేనివి



అన్నపూర్ణమ్మకు శ్రద్ధాంజలి ఘటిస్తున్న విద్యార్థులు

ఉక్కునగరం: అన్నపూర్ణ చారిటబుల్ సొసైటీ వ్యవస్థాపకురాలు పీసపాటి అన్నపూర్ణమ్మ అందించిన సేవలు ఎనలేనివని పలువురు కొనియాడారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్నో సేవాకార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేసుకున్నారు. అన్నపూర్ణమ్మ ఇటీవల మృతి చెందడంతో, శృష్టి వరల్డ్ పాఠశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి శృష్టి వరల్డ్ ఈడీ డాక్టర్ మేఘన కంభం, చైతన్య పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ పి. సుశీలారాణి, సంస్కృతి గ్లోబల్ స్కూల్ చైర్మన్ పి. సూర్యనారాయణ రెడ్డి, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఉక్కునగరానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ముగిసిన శ్యామా నవరాత్రి ఉత్సవాలు



దేవీపురంలోని రాజశ్యామల అమ్మవారి సన్నిధిలో నిర్వహిస్తున్న రాజశ్యామలా హోమం

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి పీఠంలో నిర్వహించిన శ్యామా నవరాత్రి ఉత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా రాజశ్యామల అమ్మవారికి క్షీరాభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. యూకేకి చెందిన వ్యక్తి రాజశ్యామలా హోమాన్ని సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వచ్చేనెల 1వ తేదీ నుంచి సహస్ర చండీ హోమాన్ని కెనడాకు చెందిన జీఆర్‌డీ అయ్యర్స్ గ్రూపు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు గురుమాత అన్నపూర్ణమ్మ తెలిపారు. ఈ హోమాన్ని ఐదు రోజులు పాటు నిర్వహించనున్నట్టు చెప్పారు. లోక కల్యాణమే ప్రధాన సంకల్పంగా దీనిని నిర్వహించనున్నట్టు అన్నపూర్ణమ్మ తెలిపారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



యజ్ఞోపవీత ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం 9.30గంటల నుంచి కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

మహాత్ముని బాటలో నడుద్దాం

- అహింసే ఆయుధంగా ఆయన పోరాటం ప్రపంచానికే ఆదర్శం
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- వర్ధంతి వేళ గాంధీజీకి ఘన నివాళి



గాంధీ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

గాజువాక: అహింసే ఆయుధంగా దేశ ప్రజలందర్నీ ఏకతాటిపై నడిపించిన మహనీయుడు మహాత్మా గాంధీ అని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా జోనల్ కార్యాలయంలో గాంధీజీ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరాయి పాలన నుంచి భరతమాతను విముక్తి చేయడం కోసం సత్యం, అహింసలే ఆయుధంగా ఆయన చేసిన పోరాటాలు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ప్రపంచానికి ఒక కొత్త పోరాట పంథా నేర్పిన నాయకుడు గాంధీ అని పేర్కొన్నారు. ఆయన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలన్నారు. కార్యక్రమంలో గాజువాక జెడ్సీ సింహాచలం, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ అరుణవల్లి, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, కార్పొరేటర్లు భూపతిరాజు సుజాత, లేళ్ల కోటేశ్వరరావు, నాయకులు మార్టుపూడి పరదేశి, సిరట్ల శ్రీనివాస్, గంట్యాడ గురుమూర్తి, సంపంగి ఈశ్వరరావు, తోకాడ అప్పారావు, ములకలపల్లి వెంకటేష్, పిట్టా రెడ్డి, కాకినాడ పెంటారావు, పల్లా పెంటారావు, జెర్రిపోతుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యాన్ని కాపాడుకోవాలి

మత సామరస్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా జోనల్ కార్యాలయం ప్రాంగణంలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ విభాగం అధికారులు సీహెచ్.రామనారాయణ, కుమార్, సూపరింటెండెంట్లు రమణ, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో

గాంధీ వర్ధంతి సందర్భంగా సీపీఐ నాయకులు మహాత్ముని విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఆ పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిటీ సభ్యుడు ఎ.జె.స్టాలిన్ మాట్లాడుతూ మత సామరస్యం, అహింసా మార్గంలో గాంధీ కొనసాగారని, ఆయన ఆశయ సాధనలో మనందరం నడవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, జి.ఆనంద్, అప్పారి విష్ణుమూర్తి, పి.దుర్గారావు, సలీం, దానయ్య, ఎ.శ్రీలక్ష్మి, పిల్లా సూర్యపద్మ తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా నివాళులు

అగనంపూడి: వాసవిక్లబ్, వనితా క్లబ్ అగనంపూడి ఆధ్వర్యంలో ఏరియా ఆస్పత్రి, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలల ఆవరణల్లోని మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏరియా ఆస్పత్రి ఆవరణలోని విగ్రహానికి వైద్యులు, వాసవిక్లబ్ ప్రతినిధులు పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వి.సుశీల్‌కుమార్ నివాళులర్పించారు. హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణారావు నివాళులర్పించారు. కార్యక్రమాల్లో వాసవి క్లబ్ ప్రతినిధులు మయూరి బుజ్జి, గున్నేశ్వరరావు, పెద్దిరాజు, మోహనరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.



పాత అగనంపూడి సత్రం కూడలిలో..

- పెదమడక ప్రాథమిక పాఠశాల ఆవరణలో జాతిపిత విగ్రహానికి నివాళులర్పించారు. గ్రామపెద్దలు మోటూరి వెంకటరమణ, విందుల చిరురాజు, నారాయణరావు, మడుగుల జగ్గారావు, బలిరెడ్డి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.
- 79వ వార్డు అగనంపూడి సత్రం కూడలి వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహాత్మాగాంధీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు, కొయ్య భాస్కర్‌రెడ్డి, గొలగాని శ్రీను, నెల్లి తులసి, ముత్యాల అప్పారావు, గోపిశెట్టి సత్యారావు పాల్గొన్నారు.

బాపూజీ ఆశయ సాధనకు కృషి

పెదగంట్యాడ: మహాత్మా గాంధీ ఆశయసాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 74వ వార్డు పరిధి దల్లివానిపాలెంలో జాగారపు శ్రీను ఆధ్వర్యంలో గాంధీజీ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, భూపతిరాజు సుజాత, గంట్యాడ గురుమూర్తి, పల్లా చినతల్లి, మార్టుపూడి పరదేశి, గొందేశి వెంకటరమణారెడ్డి, వాసు, కిరణ్ పాల్గొన్నారు.



అగనంపూడి జూనియర్ కళాశాలలో..



87వ వార్డులో నివాళులర్పిస్తున్న నాయకులు

గాంధీజీ కలల సాకారానికి కృషి

కూర్మన్నపాలెం: గాంధీజీ కలలు కన్న స్వరాజ్యం కోసం మనమందరం కృషి చేయాల్సిన సమయం ఆసన్నమైందని 87వ వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అన్నారు. జీవీఎంసీ 87వ వార్డు కణితి గాంధీ బొమ్మ జంక్షన్ వద్ద గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రగడ వేణుబాబు, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, ప్రగడ శ్రీనివాస్, సబ్బవరపు ఈశ్వరరావు, దాసరి అప్పడు, జాజుల శ్రీను, బొండా గోవిందరాజులు, బుల్లెట్ రమణ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి రహిత సమాజానికి కృషి

పెదగంట్యాడ: కుష్టు వ్యాధి రహిత సమాజమే లక్ష్యమని పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రమేష్‌బాబు అన్నారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కుష్టు వ్యాధిపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్పర్శ లేకపోయినా, చర్మం పాలిపోయినా, ఎరుపు రంగు మచ్చలు, చర్మం మందంగా మారడం, తిమ్మిర్లు రావడం కుష్టు వ్యాధి లక్షణాలని తెలిపారు. ఈ వ్యాధిని తొలి దశలో గుర్తిస్తే నయం చేయవచ్చన్నారు. వచ్చే నెల 13 వరకు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో కుష్టు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. ఇందులో భాగంగా గొంతినవాని పాలెంలోని ప్రాథమిక పాఠశాలలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి తనకాల సత్యనారాయణ, ధనరాజు, జగదాంబ, ఫాతిమా బేగం, కనకరత్నం, పూర్ణిమ, కమల తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో మాట్లాడుతున్న డాక్టర్ రమేష్‌బాబు

ప్రజా గర్జనకు ర్యాలీగా..

తరలిన కో–ఆపరేటివ్ సిబ్బంది



ర్యాలీలో ప్రజా గర్జనకు వెళ్తున్న కో–ఆపరేటివ్ సిబ్బంది

ఉక్కునగరం: ఉక్కు త్రిష్ణా మైదానంలో నిర్వహించిన ప్రజా గర్జనకు స్టీల్‌ప్లాంట్ కో–ఆపరేటివ్ పాలకవర్గం, సిబ్బంది ర్యాలీగా తరలి వెళ్లారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించారు. సెక్టార్–1లోని కో–ఆపరేటివ్ కార్యాలయం నుంచి పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీ సాగింది. కో–ఆపరేటివ్ స్టోర్స్ పాలకవర్గం అధ్యక్షుడు బి.టి. జగదీష్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో పాలకవర్గం కార్యదర్శి నాగభూషణం, డైరెక్టర్లు నూకరాజు, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిపాలెం కోలాట బృందానికి ప్రశంసలు

తిరుమలలో శ్రీవారి రథం ముందు ప్రదర్శన



తిరుమలలో శ్రీహరి కోలాట బృందం ప్రదర్శన (ఫైల్)

అగనంపూడి: తిరుమలలో అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవాల్లో కోలాట ప్రదర్శన చేయడాన్ని కళాకారులు అదృష్టంగా భావిస్తారు. ఆ అద్భుత అవకాశాన్ని దక్కించుకుని, దిగ్విజయంగా ప్రదర్శన ఇచ్చి, తిరిగి వచ్చారు శ్రీహరి కోలాట బృంద సభ్యులు. జీవీఎంసీ 85వ వార్డు లంకెలపాలెం దరి మంత్రిపాలెం గ్రామానికి చెందిన ఈ బృందం రథసప్తమి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానంలోని మాఢ వీధుల్లో శ్రీవారి రథం ముంగిట కోలాటాన్ని ప్రదర్శించారు. భక్తుల మన్ననలు పొందడంతో పాటు ఆలయ అధికారుల ప్రశంసలు పొందారు. బృంద నిర్వాహకురాలు పచ్చికోరు వెంకట వరలక్ష్మి సారథ్యంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలతో పాటు తిరుచానూరులోనూ ప్రదర్శనలు ఇచ్చారు. ఇటీవల విజయవాడలోని కనకదుర్గమ్మ ఆలయంతో పాటు పలు దేవాలయాలు, జాతర్లలో వందలాది ప్రదర్శనలిచ్చారు. నిర్వాహకురాలు వరలక్ష్మి మాట్లాడుతూ తిరుమల వేంకటేశ్వరస్వామి సన్నిధిలో కోలాట ప్రదర్శన మరపురాని అనుభూతి అన్నారు.

ముందుకు కదలని మురుగు

- గెడ్డల్లో పేరుకుపోతున్న వ్యర్థాలు
- తొలగించని సిబ్బంది
- స్థానికుల ఇబ్బంది



కూర్మన్నపాలెం ఎన్‌టీఆర్ కాలనీలోని ప్రధాన గెడ్డ

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86, 87 వార్డుల పరిధిలో గెడ్డలు వ్యర్థాలతో నిండిపోయాయి. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న చెత్తాచెదారం గెడ్డలో పేరుకుపోతున్నాయి. గెడ్డలో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించి డంపింగ్ యార్డుకు తరలించాల్సిన జీవీఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యం వహించడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుర్గంధంతో అవస్థలు పడుతున్నారు. పందులు, పశువులు అక్కడే తిష్ట వేసి చెత్తను చిందరవందర చేయడంతో దోమలు ఎక్కువై, స్థానికులు అంటువ్యాధుల బారిన పడుతున్నారు. ఎండిన చెత్త ఇళ్లలోకి వచ్చి పడటంతో చుట్టుపక్కల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి, సిబ్బందితో పూడిక తీయించి, మురుగు సాఫీగా ప్రవహించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



87వ వార్డు వడ్లపూడి ప్రధాన రహదారి వద్ద ఇలా..

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

ఉక్కునగరం: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ అన్నారు. స్థానిక శివశివానీ పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా కొమురం భీమ్ నృత్యం, వివిధ రాష్ట్రాల సంస్కృతిని ప్రతిబింబించే నృత్యాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల హెచ్ఎం వి. శ్రీనివాసరావు వార్షిక నివేదిక అందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఉషా సంపతి, జనరల్ సెక్రటరీ సుధీర్ సంపతి తదితరులు పాల్గొన్నారు.



వార్షిక వేడుకలను ప్రారంభిస్తున్న సీఎండీ భట్, పాఠశాల కరస్పాండెంట్

ముగిసిన భాగవత సప్తాహం

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో జరుగుతున్న భాగవతా సప్తాహం సోమవారంతో ముగిసింది. చివరి రోజు కుర్తాళం పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి అనుగ్రహ భాషణంలో బృందావనం విశేషాలను, గోపికల మధుర భక్తిని వివరిస్తూ పోతన పద్యాలను మధురంగా ఆలపించారు. రాధాదేవి భక్తిని ప్రేమతత్వాన్ని సరళ సుందరంగా విశ్లేషించారు. రాధాకృష్ణ లీలల్ని, కంస వధ, కాలయవనుల వినాశనాన్ని ఆసక్తికరంగా వివరించారు. కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద స్వామిని, పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్, పలువురు భక్తులు పాల్గొన్నారు.

రుక్మిణీ కల్యాణం నేడు..

లలితా పీఠం దర్బారు హాల్లో మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు రుక్మిణీ సహిత శ్రీకృష్ణ కల్యాణం జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

నేడు అప్పన్న గోశాలలో షెడ్డు ప్రారంభోత్సవం

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలను మంగళవారం వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి సందర్శించనున్నారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు సొంత నిధులు రూ.16లక్షలతో నిర్మించిన నూతన షెడ్‌ని ఆయన ప్రారంభించనున్నారు. ఈమేరకు సోమవారం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు, ఇంజినీరింగ్ అధికారులు ఏర్పాట్లు పరిశీలించారు. మధ్యాహ్నం ఒంటిగంటకు వై.వి.సుబ్బారెడ్డి గోశాలలో షెడ్డును ప్రారంభిస్తారని ట్రస్ట్‌బోర్డు సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్‌బోర్డు సభ్యులు సంపంగి శ్రీనివాసరావు, వారణాసి దినేష్‌రాజ్, సువ్వాడ శ్రీదేవి, ఈఈ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.




ఏర్పాట్లు పరిశీలిస్తున్న ట్రస్ట్‌బోర్డు సభ్యులు, ఈఈ శ్రీనివాసరాజు

నకిలీ పాసుతో ప్రవేశించిన మహిళకు జైలు శిక్ష

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోకి నకిలీ పాసుతో ప్రవేశించడానికి ప్రయత్నించిన కేసులో ఒక మహిళకు జైలు శిక్ష విధించారు. స్టీల్‌ప్లాంట్ సీఐ వి. శ్రీనివాసరావు అందించిన సమాచారం మేరకు వివరాలివి.. 2019 జనవరి 30న పెదగంట్యాడకు చెందిన గంటా కాసులమ్మ, వేరే వ్యక్తి పాసుతో స్టీల్‌ప్లాంట్ బీసీ గేటులో ఏ షిఫ్ట్ విధుల సమయంలో వెళ్తుండగా సీఐఎస్ఎఫ్ సిబ్బంది పట్టుకుని పాసు తనిఖీ చేశారు. అది దొంగ పాసు అని తెలుసుకుని, స్టీల్‌ప్లాంట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారిచ్చిన ఫిర్యాదు మేరకు నమోదైన కేసుకు సంబంధించిన తీర్పును సోమవారం వెలువరించారు. గాజువాక అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కాసులమ్మకు నాలుగు నెలలు జైలు శిక్ష లేదా రూ. 5500 జరిమానా విధించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం అయితే జైలు శిక్ష తప్పదని సీఐ శ్రీనివాసరావు హెచ్చరించారు.

విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి కృషి

మద్దిలపాలెం: ఇంటర్న్‌షిప్, అప్రెంటిస్‌షిప్ మేనేజ్‌మెంట్, లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టంపై నాలుగో బ్యాచ్ శిక్షణ కార్యక్రమం సోమవారం నోడల్ రిసోర్స్ సెంటర్ అయిన కృష్ణా కళాశాలలో ప్రారంభమైంది. ఈ శిక్షణ వచ్చేనెల ఒకటో తేదీ వరకూ ఉంటుందని నోడల్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. విద్యార్థుల్లోని నైపుణ్యానికి పదును పెట్టి వారిలో ఉపాధికి దోహదపడే వృత్తులపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇంటర్న్‌షిప్, అప్రెంటిస్‌కు దోహదపడే అంశాలను విద్యార్థులకు వివరించాలన్నారు. శిక్షణ కో–ఆర్డినేటర్ డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ నైపుణ్యంతో విద్యార్థుల ఉజ్వల భవితకు దిశానిర్దేశం చేయడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, ట్రైనర్లు శ్రీనివాస్, ప్రసాద్, విద్యాసాగర్, సిహెచ్.లలిత, కె.రవిబాబు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు

ఏయూ సంగీత విభాగంలో 3, 4 తేదీల్లో సదస్సు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సంగీత విభాగంలో వచ్చేనెల 3, 4 తేదీలలో సంగీత దర్శకులు, గాయకులు సాలూరి రాజేశ్వరరావు, ఘంటశాల వెంకటేశ్వరరావులపై రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహించనున్నట్టు విభాగాధిపతి ఆచార్య ఎ.అనూరాధ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ సదస్సు జరుగుతుందన్నారు. ఘంటశాల, సాలూరి స్వరపరిచిన సంగీతంపై అతిథులు ప్రసంగాలు ఉంటాయని చెప్పారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన ఈ ఇద్దరు సంగీత దర్శకులను స్మరించుకుంటూ, వారి సేవలను గుర్తుచేస్తూ భవిష్యత్ తరానికి వారి సంగీత మాధుర్యాన్ని అందించడం సదస్సు ప్రధాన ఉద్దేశమన్నారు. విజయనగరం మహారాజ సంగీత కళాశాల విశ్రాంత అధ్యాపకుడు బి.ఎ.నారాయణ ఈ సదస్సులో పాల్గొని తన అనుభవాలను పంచుకుంటారన్నారు.

బాలురకు నటనలో శిక్షణ

ఆరిలోవ: దీన్‌దయాళ్‌పురం వద్ద ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహంలో నవరస థియేటర్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నటన శిక్షణ శిబిరాన్ని గృహం సూపరింటెండెంట్ కె.వీరయ్య సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నటన ద్వారా మంచి ప్రవర్తన అలవడుతుందన్నారు. ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి ఇలాంటి శిక్షణ శిబిరాలు ఉపయోగపడతాయన్నారు. శిక్షణ శిబిరం ఏర్పాటు చేసిన అసోసియేషన్ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యఅతిథి ఎస్.నాగేశ్వరరావు మాట్లాడుతూ నవరస థియేటర్ ఆర్ట్స్ అసోసియేషన్ బాలలు కోసం పని చేస్తోందన్నారు. సుమారు దశాబ్దం నుంచి బాలలకు ఎన్నో శిక్షణ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఈ శిక్షణ శిబిరం ఇక్కడ బాలుర భవిష్యత్‌కు మార్గదర్శకంగా నిలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గృహం డిప్యూటీ సూపరింటెండెంట్ పి.రమణ, అసోసియేషన్ ప్రతినిధి పి.వి.రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ శిబిరం ప్రారంభించి మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వీరయ్య

శ్రీవారికి పుష్పాభిషేకం

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్–6లోని శ్రీవేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా సోమవారం శ్రీవారికి పుష్పార్చన సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు వివిధ రకాల పుష్పాల అలంకరణలో కనువిందు చేశారు. 75 కేజీల చామంతి, గులాబీ, కనకాంబరాలు తదితర పుష్పాలను స్వామివారికి అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. పుష్పార్చన అనంతరం యాగశాలార్చన, నిత్య పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



పుష్పాలంకరణలో వేంకటేశ్వరస్వామి

పబ్లిక్ డిమాండ్

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలోని జేసీపీ అండ్ ఈఎఫ్ చర్చి పక్కన ఇనప విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. పోల్ పక్కకు ఒరిగిపోయింది. పోల్ కింది భాగం తుప్పు పట్టి, విరిగి పోవటానికి సిద్ధంగా ఉంది. పోల్ నుంచి విద్యుత్ వైర్లు వెళ్తున్నాయి. పోల్ కూలిపోతే ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయంగా ఉంది. అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలి.

–నేలపాటి శ్యామ్‌బాబు, అక్కిరెడ్డిపాలెం



తుప్పు పట్టిన కింది భాగం



ఒరిగిన విద్యుత్ స్తంభం